సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 6 | డిసెంబర్ | 2024



వెంకన్న రాబడి రూ.4.46 లక్షలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా 38 రోజులకు రూ.4,46,995 వచ్చిందని ఈవో తెలిపారు.




పిల్లలు బడిబాట పట్టేందుకు..

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యంగా తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

8లో

డెల్టాలకు 7,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 7,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

విద్యా ప్రమాణాల మెరుగుకు సమావేశాలు

అమలాపురం రూరల్: విద్యా ప్రమాణాల మెరుగుకు మెగా పేరెంట్- టీచర్ మీట్ ఏకకాలంలో శనివారం జిల్లాలోని 1,582 పాఠశాలల్లో నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలనే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

క్షేత్రస్థాయిలో భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.

అంతర్వేది స్వామి హుండీల ఆదాయం లెక్కింపు



అంతర్వేది ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో హుండీల లెక్కింపు గురువారం జరిగింది. స్వామివారికి భక్తుల నుంచి విరాళాలుగా మొత్తం రూ.31,29,740 ఆదాయం సమకూరింది. 47 రోజులకు గాను హుండీలను తెరచి లెక్కించగా పైఆదాయం వచ్చింది. అమలాపురం ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది, స్వామివారి సేవకులు ఈ లెక్కింపు చేపట్టారు. కాగా ఆదాయం మొత్తంలో మెయిన్ హుండీల ద్వారా రూ.30,62,981, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.18,653 ఆదాయం, అన్నదాన హుండీల ద్వారా రూ.48,106 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే అంతర్వేది దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వర స్వామివారి ఆలయ హుండీల ద్వారా రూ.45,084 ఆదాయం వచ్చిందని ఆయన అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడూ కొనసాగనున్న విచారణ

సాక్షి, అమలాపురం: స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న అవినీతి దందాపై శుక్ర, శనివారాలు కూడా విచారణ కొనసాగనుంది. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రతి పనికి ఒక రేటు పెట్టి చేస్తున్న దందా విషయం వెలుగు చూడడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విచారణాధికారిగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. దీనిపై ఆయన బుధవారం తొలిదశ వైద్యాధికారులను, సిబ్బందిని విచారించిన విషయం తెలిసిందే. ఆరోపణలు చేసిన వైద్యాధికారుల వాగ్మూలం నమోదు చేసుకున్నారు. విచారణలో భాగంగా మరి కొంతమంది డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది, వివిధ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు చెందిన వైద్యులు, సిబ్బందిని సైతం విచారణ నిర్వహించనున్నారు. ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ విచారణ నిర్వహిస్తామని విచారణాధికారి సత్యనారాయణ ఆయా సిబ్బందికి సమాచారం అందించారు.

సొసైటీ ఉద్యోగుల ఆందోళన



రాజోలు డీసీసీబీ బ్రాంచ్ వద్ద ఆందోళన చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

రాజోలు: వేధింపుల కారణంగా గూడపల్లి సొసైటీ సీఈఓ నూకల వీరవెంకట సత్యనారాయణ ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో సొసైటీ ఉద్యోగులు గురువారం రాజోలు డీసీసీబీ బ్రాంచ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. డీసీసీబీ మేనేజర్ స్టీవెన్‌పాల్ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఈఓ సత్యనారాయణను మానవ హక్కుల సంఘ ప్రతినిధి ముత్యాల శ్రీనివాసరావు పరామర్శించి వివరాలు సేకరించారు. ఉద్యోగి ఆత్మహత్యాయత్నంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. విధుల నిర్వహణలో సదరు ఉద్యోగి వెనుకబడి ఉన్నారని, అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది సహకరించలేదనే విషయం తెలిసిందన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం, జనుపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మంజూరు చేయాలి



గడచిన ఎన్నికల్లో హామీ మేరకు ప్రభుత్వం సత్వరమే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి. అర్హులకు నెలల తరబడి పింఛన్లు అందించకపోవడం సరి కాదు. సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలకు పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వాలి.

– తమ్మన శ్రీనివాస్, సర్పంచ్, చెముడులంక

స్పష్టత ఇవ్వాలి



కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటికీ నిర్దిష్ట తేదీలను ప్రకటించి అమలు చేయాలి. అలాగే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడే 50 ఏళ్లకే పింఛన్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. లబ్ధిదారులకు భరోసాగా నిలవాలి.

– కె.నాగలక్ష్మి, మండపేట



లేదని పింఛన్

- కొత్త పింఛన్ల మంజూరుకు మంగళం
- లబ్ధిదారులకు మిగిలిన ఎదురుచూపులు
- ఇంకా స్పందించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో ఏడాదికి రెండు సార్లు మంజూరు

జిల్లాలో ప్రస్తుత పింఛన్‌దారుల వివరాలు

మొత్తం పింఛనుదారులు	2,16,990
వృద్ధాప్య పింఛన్లు	1,29,297
వితంతు పింఛన్లు	49,906
దివ్యాంగ పింఛన్లు	32,681
ఒంటరి మహిళలు	4,557
డయాలసిస్, పెరాలసిస్ (15 వేలు పొందే రోగులు)	549

ఆలమూరు: పేదల బతుకుకు భద్రత లేకుండా పోయింది.. కూటమి ప్రభుత్వం పథకాలు అందాలంటే ప్రహసనంలా మారింది.. సామాజిక పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం ఆరు నెలల నుంచి ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుందామనుకున్నా ఆన్‌లైన్ పోర్టల్ తెరవకపోవడంతో లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. అధికారంలోకి వచ్చాక ఏవిధమైన నిబంధనలు లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో.. అసలు ఇస్తారో లేదో తెలియని పరిస్థితి వచ్చింది. దీనివల్ల వృద్ధులు, వితంతువులు, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తామంటూ ఇచ్చిన ఎన్నికల హామీని 'కూటమి' గాలిలో కలిపేసింది. జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో ప్రస్తుతం 2,16,990 మంది వివిధ పింఛనుదారులు ఉన్నారు. ఇందులో సుమారు 50 వేల పింఛన్లు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మంజూరైనవే. పింఛన్ల మంజూరులో గత ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా వ్యవహరించింది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌దారుల వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు కుదించి పేదల పట్ల ఉదారత చాటుకుంది. అప్పట్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే జిల్లాలో వేలాది మంది లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను మంజూరు చేశారు. దీంతోపాటు పేదల అభ్యున్నతే లక్ష్యంగా కుల మతాలకతీతంగా పాలన సాగించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా క్రమం తప్పకుండా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేవారు. ఈ ఏడాది జనవరిలో జిల్లా వ్యాప్తంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ హయాంలో 7,489 పింఛన్ల మంజూరు చేశారు. అప్పటి నుంచి జూన్ వరకూ (అధికారంలోకి దిగిపోయే నాటికి) గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పింఛన్ల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో 8,467 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపట్టి ఉంటే జూలైలో కచ్చితంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు అయ్యే పరిస్థితి ఉండేదనే అభిప్రాయం ప్రస్తుత పరిస్థితుల్లో లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతుంది.

దరఖాస్తుల స్వీకరణ నిలిపివేత

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గతంలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో పాటు కొత్త దరఖాస్తుల స్వీకరణను కూడా నిలిపివేశారు. లబ్ధిదారులు ఎవరైనా గ్రామ సచివాలయానికి వచ్చి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటామని చెబితే ఇప్పటికే మూసివేసిన ఆన్‌లైన్ ప్రక్రియ ఇంకా పునః ప్రారంభం కాలేదని సిబ్బంది చెబుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదని, ఎప్పుడు అనుమతులు వస్తాయో తెలియదంటూ అసహనం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కాలంలో మండల ప్రజా పరిషత్, గ్రామ సచివాలయ కార్యాలయాల్లో వారం వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పింఛన్లు మంజూరు చేయాలంటూ వచ్చే దరఖాస్తులే అధికంగా ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నా ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీనత వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని లబ్ధిదారులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. పేద కుటుంబంలో భర్త మృతి చెందితే నిబంధనలకు అనుగుణంగా 15 రోజుల వ్యవధిలో భార్యకు పింఛన్‌ను అందించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా ఇప్పటి వరకూ ఒక వితంతు పింఛన్‌ను మంజూరు చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. పేదలు జీవించే హక్కుకు భరోసా కల్పించే సామాజిక పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇంత అలసత్వం పనికి రాదంటూ సామాజిక వేత్తలు మండి పడుతున్నారు.

ఎన్నికల హామీలన్నీ బూటకమేనా?

గడచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ బూటకమేనా అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, నెల నెలా బ్యాంకు ఖాతాలో రూ.1,500 జమ చేస్తామంటూ ఊదరగొట్టారు. అలాగే ఈనెల రెండు నుంచి రేషన్ కార్డుల జారీకి దరఖాస్తుల సేకరణ ప్రారంభిస్తామని పాలకులు ఇచ్చిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పేదలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తకపోవడం లబ్ధిదారులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగానే ఎన్నికల హామీలను సత్వరమే అమలు చేయాలనే డిమాండ్ అంతటా వ్యక్తమవుతుంది.

అధికార పార్టీ అత్యుత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కూటమి నేతలు ప్రతి నెలా పింఛన్లను పంపిణీ చేసే గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలసి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి హడావుడి చేయడం విమర్శలకు తావిస్తుంది. ప్రతి నెలా ఈ విధంగా రావడం వల్ల తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కూటమి నేతలు ప్రతి నెలా పింఛన్ల పంపిణీని ఆర్భాటం చేస్తున్నారంటూ విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాలు రాగానే దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే అర్హులందరికీ పింఛన్ల మంజూరు నమోదు ప్రక్రియను ప్రారంభిస్తామని డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్ అన్నారు. గతంలో నమోదు చేసుకున్న పింఛన్‌దారుల వివరాలు ప్రస్తుతం ప్రభుత్వానికి నివేదించామన్నారు. అలాగే వితంతు పింఛన్ల మంజూరులో ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి వితంతు పింఛన్లను అందించేందుకు అవకాశం ఉందని వివరించారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలు, తుపాను కారణంగా ఉత్పన్నమైన సమస్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం అధికారులతో జేసీ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతం అటు ఇటుగా ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లుల్లో ధాన్యాన్ని ఆరబెట్టే డ్రయర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తేమ శాతం నిబంధనల్లో మార్పు చేసి రైతుకు గిట్టుబాటు ధర పొందే వెసులుబాటును కల్పించామన్నారు. వాట్సాప్ ఆధారిత అభిప్రాయ వ్యవస్థ పటిష్టంగా అమలు చేస్తూ కనీసం మద్దతు ధర నిబంధనలను ఉల్లంఘించారని ఫిర్యాదులు ఉత్పన్నం కాకుండా అధికారులు వ్యవహరించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాల సరస్వతి, పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

అత్యధిక పోలింగ్ మనదే..



అమలాపురం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగానికి క్యూలో వేచి ఉన్న ఉపాధ్యాయులు

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో టాప్
- జిల్లాలో 95.21 శాతం నమోదు
- ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు

సాక్షి, అమలాపురం: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగిన పోలింగ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 3,296 ఓట్లు కాగా 3,138 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు ఉపాధ్యాయులు ఉదయం నుంచి బారులు తీరారు. జిల్లాలో అత్యధికంగా అయినవిల్లి మండలంలో 89 ఓట్లకు గాను 88 ఓట్లు (98.88 శాతం), అత్యల్పంగా కాట్రేనికోన మండలం 58 ఓట్లకుగాను 51 (87.93 శాతం) ఓటింగ్ నమోదైంది. జిల్లాలో అధిక ఓట్లు ఉన్న అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 606 ఓట్లకు గాను, 574 ఓట్లు పోలయ్యాయి.

పాఠశాలలకు సెలవు

జిల్లాలో పోలింగ్ కోసం ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఓటున్న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు సెలవు లేకున్నా అనుమతులతో వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల్లో తలపడుతున్న అభ్యర్థుల మద్దతుదారుల సందడి నెలకొంది. ఉపాధ్యాయ సంఘాలు సైతం చురుగ్గా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు రెండుగా చీలిపోయారు. ఒక వర్గం గంధం నారాయణరావు, బొర్రా గోపీ మూర్తి వైపు మరోవర్గం నిలవడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఈ కారణంగా పోలింగ్ శాతం అధికంగా నమోదయ్యింది.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓట్లు	పడిన ఓట్లు	శాతం
ఆలమూరు	55	51	92.73
మండపేట	183	172	93.99
కపిలేశ్వరపురం	56	54	96.43
రాయవరం	59	55	93.22
రామచంద్రపురం	414	393	94.93
కె.గంగవరం	76	69	90.79
ఆత్రేయపురం	44	43	97.73
రావులపాలెం	170	163	95.88
ఐ.పోలవరం	67	66	98.51
ముమ్మిడివరం	137	130	94.89
అయినవిల్లి	89	88	98.88
కొత్తపేట	200	197	98.50
పి.గన్నవరం	119	113	94.96
అంబాజీపేట	129	121	93.80
అమలాపురం	606	574	94.72
మామిడికుదురు	179	171	95.53
రాజోలు	242	234	96.69
మలికిపురం	161	150	93.17
సఖినేటిపల్లి	123	116	94.31
అల్లవరం	74	73	98.65
ఉప్పలగుప్తం	55	54	98.18
కాట్రేనికోన	58	51	87.93

పకడ్బందీగా ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

ముమ్మిడివరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎంఎంఎస్ పరీక్షకు నియమించిన సీఎస్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల మాదిరిగానే ఎస్ఎంఎంఎస్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లకు అవకాశం ఉండకూడదన్నారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు వంటి సౌకర్యాలు ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ బి.హనుమంతరావు మాట్లాడుతూ అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం, రెవెన్యూ డివిజన్ కేంద్రాల పరిధిలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రస్తుతం అమలవుతున్న విద్యాపరమైన అంశాలపై మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు పాల్గొన్నారు.

అభిమానుల సందడి 'తగ్గేదే లే'

- జిల్లాలో పుష్ప-2 సినిమా హడావుడి
- చిత్రం విజయంపై సర్వత్రా ఆనందం



అమలాపురంలో ఓ థియేటర్ వద్ద పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అభిమానుల సంబరాలు

అమలాపురం టౌన్: జిల్లాలో 'పుష్ప-2' సినిమా విడుదల సందర్భంగా ఏ థియేటర్ వద్ద చూసినా అభిమానుల సందడే కనిపించింది. సినిమా చూసేందుకు హీరో అల్లు అర్జున్ అభిమానులు ఎగబడ్డారు. సినిమా ప్రదర్శనకు ముందు థియేటర్ల వద్ద సంబరాలు 'తగ్గేదేలా' అన్నట్లు జరిగాయి. అమలాపురం పట్టణంలోని మొత్తం ఎనిమిది థియేటర్లకు సంబంధించి ఆరు థియేటర్లలో పుష్ప-2 సినిమానే విడుదలైంది. జిల్లాలో అమలాపురం పట్టణంతోపాటు రామచంద్రపురం, మండపేట పట్టణాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ, మండల కేంద్రాలు మలికిపురం, రాజోలు, కొత్తపేట, రావులపాలెం గ్రామాలు, లక్కవరం, తాటిపాక ఇలా పది సెంటర్లలో సినిమా విడుదల కోసం గురువారం ఉదయం థియేటర్ల వద్ద హీరో అల్లు అర్జున్ అభిమానులు వేచి ఉండడం కనిపించింది. మొదటి షో చూసి బయటకు వచ్చిన ప్రేక్షకుల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది. సినిమా విజయంతో ముఖ్యంగా అల్లు అర్జున్ అభిమానులు థియేటర్ నుంచి బయటకు వస్తూ తగ్గేదేలే అన్నట్లు సింబాలిక్‌గా షర్ట్ కాలర్ వద్ద, మెడ వద్ద చేయి వేసి చూపారు. థియేటర్ల వద్ద అభిమాన సంఘాల ప్రతినిధులు పుష్ప-2 పోస్టర్లు, కటౌట్లు చూపుతూ సంబరాలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేశారు. బాణసంచా కాల్చి కేరింతలు కొట్టారు. కొన్ని యూట్యూబ్ ఛానళ్ల రిపోర్టర్లు థియేటర్ల నుంచి సినిమా చూసి బయటకు వచ్చిన ప్రేక్షకులను సినిమా గురించి కామెంట్లు అడిగినప్పుడు సూపర్ డూపర్ హిట్ అంటూ నినాదాలు చేశారు. సినిమాలోని డైలాగులు, పాటల్లో కొన్ని బిట్లు మాట్లాడి, పాడి పుష్ప-2 హావభావాలు చూపించారు. పుష్ప-1 సినిమాకు మించి తమ అంచనాలకు దాటుకుని హిట్ సొంతం అయినందుకు ప్రేక్షకులు ఆనందించారు. పుష్ప-2 డైరెక్టర్ సుకుమార్ కోనసీమకు చెందిన వారే కావడంతో ప్రేక్షకులు పదే పదే ఆయన పేరును ప్రస్తావించారు. పుష్ప-1, 2 సినిమాల్లో హీరో అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌కు తిరుగు లేదంటూ కామెంట్స్ చేశారు. మూడేళ్ల నుంచి అల్లు అర్జున్ సినిమా కోసం ఎదురు చూస్తున్న తమకు పుష్ప-2 విజయం సరికొత్త సంతోషాన్ని ఇస్తోందని అభిమానులు తన్మయత్వంతో చెప్పడం గమనార్హం. సినిమా ఫస్ట్ ఆఫ్ సూపరైతే...సెకండ్ ఆఫ్ మరింత సెన్సేషనల్‌గా ఉందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమలాపురంలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న వెంకటరమణ థియేటర్ వద్ద టౌన్ వైడ్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వఱ్ఱే శేషు ఆధ్వర్యంలో అభిమానులు అల్లు అర్జున్ కటౌట్‌ల వద్ద సంబరాలు చేశారు. ఇలా జిల్లాలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న థియేటర్ల వద్ద ఈ తరహా సందడే కనిపించింది. టాలెంట్ ఉన్నోడిని ఎవరూ ఆపలేరని, సినిమా కథ, చిత్రీకరణలో దమ్ముంటే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్న కామెంట్స్ కూడా అభిమానుల నుంచి వినిపించాయి.

ప్రేక్షకులకు ఇదో కానుక



మూడేళ్లుగా హీరో అల్లు అర్జున్ సినిమా కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. మా ఎదురు చూపులు ఫలించినట్లుగా పుష్ప-2 సినిమా సూపర్ డూపర్ హిట్ కావడం ఆనందంగా ఉంది. మేము ఈ విజయాన్ని ఓ కానుకగా భావిస్తున్నాం. కోనసీమకు చెందిన సినీ దర్శకుడు సుకుమార్ హీరో అల్లు అర్జున్ బాడీ లాంగ్వేజ్‌కు అనుగుణంగా సినిమాను అద్భుతం చిత్రీకరించి రక్తి కట్టించారు. సినిమా మొదటి భాగం ఒక ఎత్తయితే రెండో భాగం మరో ఎత్తు. సినిమాలో ప్రతి సన్నివేశాన్ని అల్లు అర్జున్ కష్టించి నటించి సీన్‌లను పండించారు. అభిమానులుగా మేమంతా థియేటర్ల వద్ద గురువారం ఉదయం ఓ పండుగను జరుపుకొన్నాం.

– వఱ్ఱే శేషు, అధ్యక్షుడు, అమలాపురం టౌన్ వైడ్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్

క్లుప్తంగా

మార్కెట్‌లోకి కియా కార్నివాల్ లగ్జరీ లైనర్ కారు



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆల్‌న్యూ కియా కార్నివాల్ లగ్జరీ లైనర్ కారును గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక కంటిపూడి కియా షోరూమ్‌లో ఆల్ న్యూ కియా కార్నివాల్ లగ్జరీ లైనర్ కారును కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ కారులో శక్తివంతమైన 2.2 ఇంజిన్, షిఫ్ట్-బై-వైర్ (డయల్ టైప్), 8 స్పీడ్ ఆటో ట్రాన్స్‌మిషన్, 8 ఎయిర్ బ్యాగ్స్, 360 డీగ్రీ కెమెరా వంటి సెఫ్టీ ఫీచర్స్‌తో పాటు పవర్డ్ డ్రైవర్ సీటు విత్ మెమెరీ ఫంక్షన్, ఎలక్ట్రిక్ డ్యూయల్ సన్ రూఫ్, క్లవుడ్ కంఫర్ట్ టెక్నాలజీ, 12.3 ఇంచెస్ హెచ్‌డీ టచ్ స్క్రీన్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్ బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్, సీఈఓ కామేష్, ఎస్ఎం కోమల పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 20 మందికి జరినామా

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలో మద్యం తాగి పోలీసులకు పట్టుబడిన 20 మందికి ప్రత్తిపాడు, తుని న్యాయమూర్తులు గురువారం రూ.1.81 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సీఐ బి.సూర్య అప్పారావు కథనం మేరకు.. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి, వాహనాలు నడుపుతున్న 17 మందిని అరెస్టు చేశారు. వీరిని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కాటం భాను ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ.1.70 లక్షల జరిమానా విధించారు. రౌతులపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నిందితునికి తుని కోర్టు న్యాయమూర్తి రూ.10 వేల జరిమానా విధించారు. అంతేగాక బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని, తుని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన



పెద్దాపురంలో ఆందోళన చేస్తున్న సుబ్రహ్మణ్యం బంధువులు

పెద్దాపురం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద గురువారం మృతుడు దూళ్ల సుబ్రహ్మణ్యం బంధువులు ఆందోళనకు దిగారు. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో సుబ్రహ్మణ్యం చెట్టు కొమ్మలు కొడుతుండగా 11 కేవీ విద్యుత్ తీగలు తగులుకుని ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. అతనిని పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం చెయ్యాలని మృతుడి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

8న ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూల్‌లో బాలురు, బాలికల ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఎస్ గోపాలకృష్ణ తెలిపారు. ఆ రోజు సబ్ జూనియర్ ఆర్చరీ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 2007 జనవరి 1 తేదీ తర్వాత జన్మించిన బాల బాలికలు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 99890 01162 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు.

పిల్లలు బడిబాట పట్టేందుకు..

- రేపు మెగా పేటీఎం
- ఏర్పాట్లలో విద్యా శాఖ నిమగ్నం
- 100 శాతం సక్సెస్‌పై పండగ ఎఫెక్ట్



రాయవరం: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యంగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దీనికి మెగా పేటీఎంగా నామకరణం చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఆందోళనకరంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం, సమాజ భాగస్వామ్యం, విద్యార్థుల ప్రగతిని తెలియజేసేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేలా అవసరమైన సూచనలను తల్లిదండ్రుల నుంచి సేకరించడం, పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం వంటి అంశాలు ప్రాతిపదికగా, రాజకీయాలకు అతీతంగా, ఆహ్లాదకర వాతావరణంలో ఈ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 7వ తేదీ శనివారం ఈ సమావేశాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. దీనికి అనుగుణంగా ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశాలను ఉప విద్యా శాఖాధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరల్, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 1,582, తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 988, కాకినాడ జిల్లాలో 1,280 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అక్కడ మెగా పేటీఎం సదస్సులకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనికిగాను కోనసీమ జిల్లాకు రూ.28.04 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాకు రూ.23.08 లక్షలు, కాకినాడ జిల్లాకు రూ.30.17 లక్షల నిధులు కేటాయించారు.

విద్యార్థుల ప్రగతి నివేదికలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటికీ రెండు ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ సమ్మేటివ్-1 పరీక్ష నిర్వహించేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటికే జరిగిన రెండు ఫార్మేటివ్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు సాధించిన మార్కులను ప్రగతి నివేదికల్లో పొందుపర్చి తల్లిదండ్రులకు అందించనున్నారు. ఈ ప్రగతి నివేదికల్లోనే విద్యార్థులు సాధించిన మార్కులతో పాటు హాజరు, క్రీడా ప్రగతి, వ్యక్తిగత ఆరోగ్యాంశాలు పొందుపరచనున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కలిగించనున్నారు. అలాగే సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు, తల్లిదండ్రులకు మహిళా పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తారు. ఇదే సందర్భంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. విద్యార్థులతో పాటు మెగా పేటీఎం రోజు తల్లులకు రంగవల్లులు పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారు సాధించిన విజయాలను తెలియజెప్పేందుకు చర్యలు తీసుకుంటారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలు మధ్యాహ్నం ఒంటి గంటకు సహపంక్తి భోజనంతో ముగియనున్నాయి. ఈ సమావేశాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సక్సెస్‌పై షష్ఠి ఎఫెక్ట్

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మెగా పేటీఎంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సమావేశాలు విజయవంతం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 7న సుబ్రహ్మణ్య షష్ఠి కావడంతో సమావేశాలు ఎంతవరకూ సక్సెస్ అవుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హిందువులు సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని జిల్లాలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. సాధారణంగా షష్ఠి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు స్థానిక సెలవును కూడా ప్రకటించారు. మెగా పేటీఎం నేపథ్యంలో సెలవును మంజూరు చేసేందుకు అధికారులు అంగీకరించరు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఏ మేరకు సమావేశాలకు హాజరవుతారనే సందేహాలను ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. షష్ఠి నేపథ్యంలో జిల్లా వరకూ మరోరోజు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించాలన్న కారణంగా ఈ నెల 7న కచ్చితంగా నిర్వహించాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు ఇచ్చారు. మెగా పేటీఎం నిర్వహణ నిమిత్తం సమగ్ర శిక్షా ద్వారా పాఠశాలలకు నిధులు విడుదల చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మెగా పేటీఎం విజయవంతం చేసేందుకు వారం రోజులుగా పాఠశాలల్లో అవగాహనా సమావేశాలు ఏర్పాటు చేశాం. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశాలను నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.

– బీవీవీ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, సమగ్ర శిక్షా, అమలాపురం

కచ్చితంగా విజయవంతం చేస్తాం



మెగా పేటీఎంను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కచ్చితంగా సమావేశాలను విజయవంతం చేయాలని డీవైఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చాం. స్థానిక పరిస్థితులను అంచనా వేసుకుని అందుకనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశాలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా విద్యా శాఖాధికారి, అమలాపురం

షష్ఠి ఉత్సవాలకు వేళాయె..

- బిక్కవోలులో పూర్తయిన ఏర్పాట్లు
- రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం



బిక్కవోలు ఆలయం వద్ద సంతానం కోసం నిద్రిస్తున్న మహిళలు (ఫైల్)

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఖ్యాతి గాంచిన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. డిసెంబర్ 6వ తేదీ రాత్రి నుంచి 12వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి తెల్లవారితే శనివారం 1.20 గంటకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. గత ఏడాది రెండు లక్షల మంది భక్తులు రాగా, ఈ ఏడాది అంతకుమించి భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. ప్రధాన రహదారిలో సినిమా సెంటర్ నుంచి రావిచెట్టు వరకూ రోడ్డుకు ఇరువైపులా ఎల్ఈడీ దీపకాంతులను ఏర్పాటు చేశారు.

ప్రధాన ఆకర్షణగా సంబరం

బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణ శనివారం జరిగే స్వామివారి సంబరం. ఈ సందర్భంగా గరగ, గారడీ నృత్యాలు, తీన్‌మార్, బ్యాండ్ పార్టీలు, అఘోరా నృత్యాలు తదితర కార్యక్రమాలతో పాటు సాయంత్రం 5 గంటల నుంచి తెల్లవారే వరకూ బాణసంచా కాల్పులు తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు.

సంతాన ప్రాప్తి కోసం..

మార్గశిర శుద్ధ షష్ఠి రోజున కుమారస్వామివారి షష్ఠి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆ రోజున సంతానం లేని మహిళలు పుట్టపై ఉంచిన నాగుల చీరను ధరించి ఆలయం వెనుక నిద్రిస్తే స్వామి కలలో సాక్షాత్కరించి సంతాన ప్రాప్తి కలగజేస్తారని పూర్వం నుంచి భక్తుల నమ్మకం. ఈ విశ్వాసంతోనే రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. షష్ఠి ఉత్సవాల సందర్భంగా రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. శనివారం ఉదయం నుంచి నుంచి సన్నాయి మేళాలు, బ్యాండ్ మేళాలతో సందడిగా ఉంటుంది. శుక్రవారం రాత్రి 6 గంటకు భజన, 9 గంటలకు శివపార్వతులు కల్యాణం బుర్రకథ, 1.20 తీర్థపు బిందె సేవ అనంతరం ఏలూరు వారిచే నాబత్ ఖానా కచేరీ, 7న షష్ఠి మహోత్సవాల్లో భాగంగా 8 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, మొగలుత్తూరు, ఉండ్రాజవరం, బిక్కవోలు గ్రామాల బ్యాండ్ కచేరీ 5 గంటలకు ఉంటుంది. రాత్రి 11 గంటలకు బాణసంచా పోటీలు నిర్వహిస్తారు. 8న స్వామివారి రథోత్సవం, కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ మ్యూజికల్ నైట్, 9న కూచిపూడి నృత్య ప్రదర్శన, 10న రాజనర్తకి పౌరాణిక నాటకం, 11న స్వామివారి ఏకాహం, సుదిటిరాత సాంఘిక నాటకం, 12న ఏకాహం ముగింపు, రాత్రి మహాన్నసమారాధనతో షష్ఠి ఉత్సవాలు పూర్తవుతాయి.

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



ఈ ఏడాది భక్తులు భారీ వస్తారనే అంచనాతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు, గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఉత్సవాలకు సుమారు రూ.50 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. అన్ని ఏర్పాటు పూర్తి చేశాం.

– పల్లె వాసు, షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్, బిక్కవోలు

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం



ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

ముమ్మిడివరం: ఖననం చేసిన ఓ వ్యక్తి మృతదేహానికి ముమ్మిడివరం పోలీసులు గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. మర్లపాలెం కాశివారిపేటకు చెందిన కాశి సత్యనారాయణ (45) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని సోమవారం ఖననం చేశారు. అయితే సత్యనారాయణది ఆత్మహత్య కాదని అతని సోదరుడు బాలయోగి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్సై డి.జ్వాలాసాగర్‌లు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి గురువారం వైద్యులు రెవెన్యూ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. సత్యనారాయణకు భార్య విజయకుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యోగా సాధనతో మానసిక ఆరోగ్యం



నన్నయ వర్సిటీ జట్టుకు ఎంపికైన మెన్ అండ్ ఉమెన్ టీమ్‌లు

రాజానగరం: యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.సుధాకర్ అన్నారు. అంతేకాకుండా అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునేందుకు యోగా తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు యోగా సాధన ద్వారా జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవచ్చని అన్నారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ యోగా మెన్ అండ్ ఉమెన్ కమ్ యూనివర్సిటీ టీమ్ ఎంపికలు గురువారం జరిగాయి. ఈ ఎంపికలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పోటీల ద్వారా మెన్ అండ్ ఉమెన్ టీమ్‌లకు టీమ్‌కి ఇద్దరు అదనపు అభ్యర్థులతోసహా 16 మందిని యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. వీరిలో మెన్స్ టీమ్‌కు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి టి.సూర్య, జి.స్వామి, తణుకు ఆకుల శ్రీరామ డిగ్రీ కాలేజీ నుంచి టి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్, డి.మణికంఠ, జె.మణిసత్య, రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సత్తిబాబు, ఎ.హరినందకిశోర్ ఎంపికయ్యారు. ఉమెన్ టీమ్‌కు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల నుంచి బి.భవానీప్రసన్న, బి.నాగలక్ష్మిదుర్గ, కె.జ్యోతి, ఎ.సౌమ్యనాగవల్లి, భీమవరం డీఎన్ఆర్ కాలేజీ నుంచి సీహెచ్ మాధవి, తణుకు ఆకుల శ్రీరామ డిగ్రీ కాలేజీ నుంచి టి.లావణ్య, పి.నాగలక్ష్మి, రాజమహేంద్రవరం గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ నుంచి కె.హర్షనదేవి ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి 27 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు వీరు హాజరవుతారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.బాల సత్యనారాయణ తెలిపారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



మహిళా, పురుషుల జిల్లా జట్లతో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, సెలక్షన్ కమిటీ సభ్యులు

సామర్లకోట: ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం సంతనూతల పాడులో ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జరగనున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని గురువారం కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీను విలేకర్లకు తెలిపారు. క్రీడాకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయడం కోసం సుమారు 20 రోజుల పాటు వారికి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం ఉమ్మడి జిల్లా జట్లను 12 మంది క్రీడాకారులతో ఎంపిక చేస్తామన్నారు. జిల్లా పురుషుల జట్టుకు కె.శ్రీనివాసు (అంతర్జాతీయ క్రీడాకారుడు, కెప్టెన్), వి.పవన్‌కుమార్, నాగు, శ్రీహరి, మనోహర్, దుర్గారావు, డేవిడ్, వెంకటనాథ్, ప్రశాంత్, నవీన్, మణి, ప్రవీణలను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా మహిళా జట్టుకు అపరాంజిత, పరిమిళ, నాగమణి, అరుణ, ఆవేకా, వర్షిత, భవాని, దీపిక, మంజుల, వెంకటలక్ష్మి, జీవన జ్యోతిలను ఎంపిక చేశారు. రాష్ట్ర మాజీ కోచ్ పోతుల సాయిప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నిమ్మకాయల కిరణ్, తాళ్లూరి వైకుంఠం, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కోట్ని, వీవీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు. క్రీడాకారులకు యూనిఫామ్స్‌ను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ అందజేశారు.

లంకూరులో కిడ్నాప్ కలకలం!

- కట్టుకథ అల్లిన బాలిక
- నిరూపించిన పోలీసులు



సీతానగరం శివాలయంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎస్సై రామ్‌కుమార్

సీతానగరం: సీతానగరం లంకూరుకు చెందిన ఓ బాలిక (13) తనను కిడ్నాప్ చేశారని, తప్పించుకుని వచ్చానని ఇంటికి వచ్చి చెప్పడంతో ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కిడ్నాప్ వార్త అంతా వ్యాపించడంతో ఒక్కసారిగా ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఎస్సై తన సిబ్బందితో హుటాహుటిన విచారణ చేపట్టి బాలిక కట్టుకథ చెప్పిందని ఆధారాలతో తేల్చి చెప్పారు. ఆ వివరాల్లోకి వెళితే.. సీతానగరం పంచాయతీ లంకూరుకు చెందిన ఓ బాలిక ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. స్కూల్‌కు వెళ్లిన ఆమె ఇంటికి ఏడుస్తూ వచ్చి తనను గుర్తు తెలియని వ్యక్తులు నల్ల ముసుగులు వేసుకుని శివాలయం వద్ద నోరునొక్కి బ్లాక్ కారులో బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్లారని, నాలుగు బొమ్మల సెంటర్ ఆర్‌కే రెస్టారెంట్ వద్ద కారు దిగి కిడ్నాపర్లు ఫోన్‌లో మాట్లాడుతుండగా డోర్ తీసుకుని పారిపోయి వచ్చానని తల్లిదండ్రులను నమ్మించింది. దీంతో తల్లిదండ్రులు భయాదోళనకు గురయ్యారు. దీనిపై ఆమె తండ్రి సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఎస్సై డి.రామ్‌కుమార్ తన సిబ్బంది అక్కడకు వెళ్లి విచారణ చేశారు. సీతానగరంలో ఉన్న ప్రధాన కూడలి, దుకాణాలు, ఆలయాల వద్ద సీసీ కెమేరా పుటేజీలను పరిశీలించారు. స్థానిక శివాలయం వద్ద సీసీ పుటేజీ పరిశీలించగా అసలు కథ బయటపడింది. ఆ బాలిక శివాలయంలో కొంతసేపు కూర్చుని ఉందని, తరువాత ఇంటికి వెళ్లినట్లు సీసీ పుటేజీలో బయటపడింది. చివరికి కిడ్నాప్ ప్రయత్నాలు ఏమీ జరగలేదని పోలీసులు తేల్చి చెప్పారు. కేవలం స్కూల్ మానేయడానికి ఆమె ఈ కట్టు కథ అల్లిందని ఎస్సై వివరించారు.

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు ఎంపికైన కాకినాడ జిల్లా జట్టుతో విజయ్‌ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు కాకినాడ జిల్లా జట్లను గురువారం పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఎంపిక చేసినట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకూ కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టీటీ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు, విజయ్‌ప్రకాష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్ అండర్-15 బాలుర విభాగానికి ఎంబీఎస్ గోపీచంద్, వై.శ్రవణ్‌రాజ్, డీకే ప్రహర్ష, టి.సాయి శరవణ్‌లు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ అండర్-15 బాలికల విభాగంలో ఎం.శాంతిజ్యోతి, ఎం.దర్శిక, టి.సాయి సుదీక్ష, కె.నయన, పురుష విభాగంలో విక్యాత్, విజయ్‌ధర్, మోహిత్, ఆనంద్, తనూష, మహిళా విభాగంలో ముపర్నదాస్, శాంతిజ్యోతి, టి.సాయి సుదీక్ష, ఎం.దర్శిక, షరీఫలు కాకినాడ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు విజయ్ ప్రకాష్ తెలిపారు. చీఫ్ రిఫరీగా పి.వేణుగోపాలరావు, నీలం శ్రీరామ్, మేనేజర్ శ్రీసింగరాజు, అరుణ్‌కుమార్‌లు వ్యవహరించనున్నారు.

బియ్యం అక్రమాలపై సమగ్ర దర్యాప్తు

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఉన్న మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్‌సీ) పాయింట్లో జరిగిన రేషన్ బియ్యం అవకతవకలపై కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ గోవిందరావు స్థానిక మార్కెట్ యార్డుకు చేరుకుని తనిఖీ చేపట్టారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అలాగే ప్రభుత్వం నుంచి వస్తున్న స్టాక్‌ను లారీల నుంచి దిగుమతి చేసి గోదాములో భద్రపరచడం, తిరిగి ఆ స్టాక్‌ను చౌక డిపో దుకాణాలకు ట్రాకర్‌పై తరలిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. రోజువారీ స్టాక్ వివరాలను నిక్షిప్తం చేసే కంప్యూటర్‌లో వివరాలు చూశారు. అక్కడే ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నించి పలు విషయాలను సేకరించారు. అనంతరం స్టాక్‌ను ఎగుమతి, దిగుమతి చేసే హమాలీలను ప్రశ్నించి వారి రికార్డులను కూడా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత నెలలో స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఎంఎల్‌సీ పాయింట్ నుంచి రూ.1.79 కోట్లు విలువ చేసే 375.513 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పట్టిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఇందుకు సంబంధించి సివిల్ సప్లయిస్ ముమ్మిడివరం అసిస్టెంట్ మేనేజర్ వి.నాగేశ్వరరావు బుధవారం అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించామన్నారు. అన్ని కోణాలలో సమగ్ర నిర్వహించి అవకతవకలకు పాల్పడిన కారకులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.